# రిక్షావాడు




గోపీచంద్

నేను బజార్లో నిలబడ్డవాణ్ణి నిలబడ్డట్టు యెగిరి గంతేశాను. చేతులోవున్న రిక్షా వెనక్కు దొర్లిదొర్లి లాంతరు స్తంభానికి గుద్దుకుంది. లాంతరు స్తంభం నా రిక్షాను చూస్తూ నిలబడితే, బజార్న పోయేవాళ్ళంతా నన్ను చూస్తూ నిలబడి పోయారు. "రిక్షా లాగుతూ పొట్టపోసుకునే నీకు యింత సంతోషం యెందుకు వచ్చింది" అని అడుగుతారు. "రాగూడదే" అని అంటారు. చెపుతాను—

నాది నల్లగొండ తాలూకాలో ఒక చిన్న పల్లెటూరు. ఆ పల్లెటూళ్ళో ఉన్న అందరికి మల్లేనే, నేనూ వ్యవసాయం చేసుకొని పొట్టపోసుకునేవాణ్ణి. నాకు ఉన్నది నాలుగు ఎకరాలే అయినా దాన్నే నమ్ముకొని కాలం గడిపేవాణ్ణి. మా తాలూకాలో అక్కడక్కడా చెరువులు, బావులూ ఉన్నా, వ్యవసాయం యెక్కువ భాగం వానలమీదే ఆధారపడి వుండేవి.

అటువంటిది ఒక కాలాన, వరుసగా నాలుగేళ్ళు వానచినుకే పడకుండా పోయింది. ఇక రైతుల కడగండ్లు యేమని చెప్పను? రాలిపోయినవాళ్లు రాలి పోయారు; ఊళ్ళోనుంచి లేచిపోయిన వాళ్లు లేచిపోయారు. ఉన్నవాళ్ళు కళ్ళల్లో కొనవూపిరి పెట్టుకొని ఇప్పటికా, ఇంకా

కాసేపటికా—అని బ్రతుకును ఈడుస్తున్నారు. నాకేమీ పాలుపోలేదు. నా సంగతీ నా పెళ్ళాం బిడ్డలసంగతీ అటుం చండి. నా ముసలితల్లి ఇంకా బ్రతికే వుంది. నన్ను కని పెంచినతల్లి ఇన్నాళ్లూ యెట్టాగో ఆమె ప్రాణాలు నిలబెట్టుకుంటూ వచ్చా. ఇంకేం చెయ్యాలి?"

కొండమీదకు వెళ్ళి ఏదో ఆకు దులుపుకు వచ్చేవాణ్ణి. ఇంత గంజి కాసుకొని ముందు ఆమెకిచ్చి మిగిలింది అందరం తలా కాస్త తాగేవాళ్ళం. ఇప్పుడు ఆ ఆకుకూడా కరువైంది. ఎండలకు కొండ, మంగలం కాలినట్లు కాలిపోతూ వుంది. ఎక్కడిమొక్క లక్కడే మాడిపోయినై.

ఆ రాత్రి ఉత్తచేతుల్తో రావటం అమ్మ చూచింది. ఒక్కసారి పిల్లల మొహాల లోకి చూచింది. వూరుకుంది. బావురుమని ఏడవడానికి ఆమెకు ఓపిక ఎక్కడుంది? కన్నీరు రాల్చటానికి తడి యెక్కడుంది? చెంగుపరచుకొని కాళ్లు డొక్కల్లోకి ముడుచుకొని పడుకుంది. ఆమె చచ్చిపోవటానికి సిద్ధపడుతూ వుందని నాకు అర్థమైంది. ఏం చెయ్యను? కన్నతల్లిని చావుకు ఒదిలిచూస్తూ ఊరుకోవలసిందేనా?

ఆ రాత్రే పట్టణానికి బయలుదేరాను. పట్టణంలో యేదో ఒకవిధంగా బ్రతకవచ్చని మావాళ్లు అనుకోవటం నేను అనేకసార్లు వింటూ వచ్చాను. ఆ మధ్య పట్టణంనుంచి ఒకాయన వచ్చాడు. పట్టణం వస్తే తను పని చూపిస్తానన్నాడు. వెళ్ళటానికి రైలుచార్జి తనే పెట్టుకుంటా నన్నాడు. చాలామంది ఆయన్తోపాటు వెళ్ళారుకూడా. నేను వెళ్ళలేదు. మా అమ్మ ఒప్పుకోలేదు. 'గేదల్ని, దున్నల్ని అమ్మినట్లు నిన్ను అమ్మేస్తారా' అంది. 'రైలు పెట్టెల్లో కుక్కి ఏ రంగమో తోల్తారు" అంది. "చావాల్సి ఒస్తే పుట్టినూరూ, మెట్టినూరూ యిక్కడే చద్దాం. చావక ఎవరైతే మాత్రం యెల్లకాలం బ్రతుకుతారట్రా!" అంది.

నేను ఆమె మాటకు యెదురు చెప్పలేక పోయాను. ఉండిపోయాను. అప్పటికి మా ఊరి పరిస్థితులు అంత ఘోరకలిగా లేవు కూడాను. పొట్టనింపుకోవటానికి ఆకో, అలమో యింత దొరుకుతూనే వుంది. ఇంకా, ఇవాళో రేపో నాలుగు చినుకులు రాలకపోతయ్యా. మనుష్యులం కాకపోతామా! అనే ఆశ ఆ నాటికి చావలేదు.

ఇప్పుడేముంది! ఒకరి తర్వాత ఒకరు కండ్ల ముందు దాటిపోతూవుంటే చేసేది లేక చేతులు ముడుచుకొనిచూస్తూ కూర్చోటమేగా! పట్టణానికి పోతే ఇదన్నా తప్పుతుంది.

ఆ రాత్రే బయలుదేరాను. ఎవ్వరికి చెప్పినా ఒప్పుకోరని నాకు తెలుసు. ఎవ్వరికీ చెప్పకుండా బయలుదేరాను. ఎలాగో పట్టణం జేరుకున్నాను! నేను అంతకు ముందు మా వూరు విడిచి పెట్టినవాణ్ణి కాదు. పట్టణాన్ని గురించి, అక్కడ వుండే మనుష్యులను గురించి, వాళ్లూ వాళ్లు చెప్పే కబుర్లు విన్నవాణ్ణికాని; ఎప్పుడూ పట్టణం చూచినవాణ్ణి కాదు.



యువ

ఇంకేముంది ఈ పట్టణాన్ని చూసే టప్ప టికి నాతల తిరిగిందంటే నమ్మండి! ఈ మేడలూ, ఈ కారులూ, ఈ బళ్ళూ, ఈ జనాలూ, నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను. మొదట్లో ఎట్లా నడవాలో తెలియలేదు. ఎటు నడచినా యెవ్వరికో వొకరికి అడ్డం తగులుతూనే వుండేవాణ్ణి ఇదంతా ఏదో తిరునాళ్ళగా, పెద్ద సంతగా వుంది గాని, మామూలుగా మనుష్యు లుండే వూరుగా లేదు.

ఇక్కడ పల్లెటూరికిమల్లే కాదు. ఎక్కడ చూస్తే అక్కడే అన్నం కన బడుతూవుంది. అన్నమే కాదు, ఎక్కడ చూస్తే అక్కడే పిండివంటలు. ఎటు చూచినా తినుబండారాలే నా కళ్ళకు కని పించినై. ఎంత ఆశ్చర్యం! పల్లెటూళ్లలో నాలుగుమెతుకులు కనిపిస్తే, ఆ రోజు పండగే. ఇక్కడ ఆశ్చర్యకరమైన విష యం ఒకటి తెలుసుకున్నాను. ఏమి టంటారా ? చెబుతాను :

తిండిపదార్థాలు వున్నమాట నిజమే. కాని, తిండిలేక అలో లక్ష్మణా అని ఏడ్చేవారు ప్రక్కనే వున్నారు. ఈ తిండికీ, వాళ్ళ ఆకలికీ ఏమీ సంబంధం వున్నట్లు కనపడదు. ఒక దుకాణంలోంచి తిని తేపుతూ జనం వస్తూనే వున్నారు; ఒక బాలింతరాలు చంటిదాన్ని చేతుల్లో పెట్టుకొని, "ఒక్కపైసా వెయ్యండి బాబూ" అని అడుగుతూనే వుంది. ఆమె మొర ఆలకించేవాళ్ళే లేరు. పోనీ, ఆ దుకాణదారుకైనా ఆ బాలింతరాలికి ఒక ముద్దవేసి పంపించాలని తట్టలేదు పదార్థా లన్నీ కంటికి కనపడుతూనే వున్నాయి. తినేవాళ్లు తింటూనే వున్నారు. వెళ్లేవారు వెళ్తూనే వున్నారు. ఆ బాలింతరాలి మొర మాత్రం ఒక్కరూ ఆలకించరు. ఏ మాశ్చర్యం ఇది! పల్లెటూళ్ళలో డబ్బున్న వాళ్ళున్నా, దానిని ఇట్లా ప్రదర్శించరు... ఎవ్వరయినా బిచ్చం అడిగినా నిండు కున్నాయి, అంటారు. ఉంచుకొని లేవ న్నందుకు సిగ్గుపడతారు. ఇక్కడిదే మన్యాయం? తిండిలేక మాడేవారి ముందు రకరకాల తినుబండారాలు ప్రదర్శిస్తారు. కాని అవి తినే హక్కు వారికి లేదు. ఇదేమి అన్యాయమో!

నేను ఆ పంపులో, ఈ పంపులో నీళ్లు తాగి రెండు రోజులు గడిపా. రెండోరోజు నా అదృష్టవశాత్తూ మా వూరు ఒచ్చి పట్టణంలో పని జూపిస్తానని చెప్పిపోయినాయన కనుపించాడు. ఆయన్ని జూడగానే ప్రాణం లేచివచ్చింది. దణ్ణంపెట్టి రక్షించమన్నాను. ప్రాణం కాపాడమన్నాను. ఆయన అక్కడ కొన్ని రిక్షాలకు యజమాని, అని నా కప్పుడు తెలిసింది.

"రిక్షా లాగుతావా" అని అడిగాడు.

నేను ఒక్కసారి కలయచూశాను. ఎక్కడ చూసినా రిక్షాలూ లాగేవాళ్ళే! తప్పేమి వుంది? ఇంటిదగ్గర వాళ్ళని బ్రతికించుకోవటానికి ఏ ఉపాయం అయితేం? "వూ" అన్నాను.

ఆ నాటినుంచీ ఈ నాటివరకూ రిక్షా

లాగుతున్నాను. నెలనెలా కొద్దో గొప్పో డబ్బు ఇంటికి పంపుతున్నాను. దానితో మావాళ్లు ప్రాణాలు నిలబెట్టుకుంటున్నారు. కాని ఎన్నాళ్లు ఇలా! నేను డబ్బయితే సంపాదిస్తున్నానుగాని, నా మనస్సుకి ఇది వరకు వున్న హాయిలేదు. నాలో ఇంతకు ముందు ఉన్నదీ, తప్పకుండా వుండవలసిందీ, ఏదో పోయినట్లు అనిపిస్తూవుంది. మొదట్లో "రిక్షా యెక్కుతారా?" అని యెవ్వరినైనా అడగటానికే సిగ్గువేసేది. రిక్షాలో కూర్చున్నవాళ్లని చూస్తే నవ్వు వొచ్చేది. ఎంత ఆపుకుందామన్నా ఆగేది కాదు. అందుకని తలవంచుకుని వాళ్లు ఎంత యిస్తే అంత తీసుకొని పోతుండే వాణ్ణి.

నేనున్నచోటికి దగ్గరగా ఒక పెద్ద మనిషి పొద్దున్న పదింటికి ఒక లాంకోటూ, జరీ తలపాగా పెట్టి ఆఫీసుకి బయలుదేరేవాడు. ఆయనకు రెండు మేడలున్నాయి. ఒక మేడలో తనుండేవాడు; రెండో మేడ అద్దెకిచ్చేవాడు. బాగా డబ్బున్నవాడని అందరికీ ఆయనంటే గౌరవం. నేను రిక్షాలాగటం మొదలు పెట్టిన తర్వాత ఆయన నా దగ్గరకు వచ్చి, "ఎంతకి కడతావ్?" అని అడిగాడు. "బాగామ్" దగ్గరకు అని చెప్పాడు. "మీ ఇష్టం" అన్నాను. "రెండణాలు" అన్నాడు. నేను ఒప్పుకున్నాను.

అప్పటినుంచీ ఎప్పుడూ నా రిక్షాలోనే వెళ్లేవాడు. నన్ను చూచి జాలిపడి మంచి వాడికి సహాయం చెయ్యాలనే ఉద్దేశ్యంతో నా రిక్షాలో యెక్కుతున్నట్టు రోజు కొకసారైనా చెప్పేవాడు. నేను ఎక్కడున్నా వెతుక్కుంటూ వచ్చేవాడు. మొదట్లో నేను ఆయన మాటలు నమ్మా. తరువాత అక్కడనుంచి బాగామ్‌కి నాలుగణాలు తీసుకుంటారనీ, ఏ పరిస్థితుల్లోనూ, మూడణాలకంటే తక్కువకు ఏ రిక్షావాడూ రాడనీ తెలిసింది. ఈ సంగతి తెలిసింతర్వాత ఆయన్ని చూచినప్పుడల్లా నాకు నవ్వు వచ్చేది. ఇంత డబ్బున్నాయనకు ఒక్క అణాకోసం యింత తాపత్రయం దేనికో! ఇంత నటనా, ఇన్ని అబద్ధాలూ దేనికో, నాలో నేను నవ్వుకునే వాణ్ణి. ఆపుకోలేకపోయేవాణ్ణి. ఒకటి రెండుసార్లు "ఎందుకల్లా నవ్వుతావ్?" అని ఆయన అడిగారు కూడా! ఏం చెప్పేది? "అప్పుడప్పుడూ అట్లా వస్తుంది ఎందుకో?" అన్నాను.

"చాల్లే వూరుకో?" అనేవాడు.

ఎట్లా వూరుకునేటట్టు?

ఒకరోజున నేను బాగామ్ దగ్గిర రిక్షా పెట్టుకొని వున్నాను. ఆయన వచ్చి ఇంటికి రిక్షా కట్టమన్నాడు. నేను సిద్ధపడేలోగా ఈయన స్నేహితుడు ఒకాయన వచ్చాడు. నల్లగా బాగా లావుగా వున్నాడు.

"నువ్వు కూడా రా, ఒకే రిక్షాలో వెళ్దాం" అన్నాడాయన.

"ముందు యెంతకొస్తాడో అడుగు" అన్నాడు, ఆయన స్నేహితుడు.

"ఎంతో ఒకంతలే" అన్నాడాయన.

"ఆ తర్వాత పేచీకి వస్తాడు" అన్నాడు ఆయన స్నేహితుడు.

''అటువంటి వాడు కాడులే'' అన్నా డాయన

ఇద్దరూ రిక్షాలో కూర్చున్నారు. నేను సాగాను. వాళ్ళు రిక్షాలో కూర్చుని అనేక రహస్యాలు మాట్లాడుకుంటున్నారు. ఇత రులకు ఏమాత్రం తెలియకూడని రహ స్యాలు! మరి నేను వింటున్నాగా! నేను వింటున్నానేమో—అనే భయం వారి కెందుకులేదు? నాకు ఆకస్మాత్తుగా జవాబు తట్టింది. నన్ను మనిషికింద వాళ్లు లెక్క-కట్టటంలేదు. ఈ ఆలోచన రావటంతోనే, నేను రిక్షా లాగటం మొదలు పెట్టిన తర్వాత జరిగిన ఎన్నో సంఘటనలు గుర్తుకు వచ్చినై. అన్నీ ఒకే విషయాన్ని రుజువు చేస్తున్నై; రిక్షా ఎక్కే-వాళ్ళె వ్వరూ నన్ను మనిషిగా లెక్క-కట్టటంలేదు. అంతకు ముందున్నదీ, తప్పకుండా ఉండ వలసిందీ ఏదో పోయినట్టుందన్నానే— అవి ఇదేనేమో! ఇతరులచేత మనిషిగా చూడబడక పోవటమే నేమో అసలు ఆ లక్షణాలు నాలో పోయినయ్యేమో!

పల్లెటూళ్లో ఈ బాధలేదు. ఎన్ని కష్టాల్లో, ఏ పరిస్థితుల్లో వున్నా మనిషిని మనిషిగా చూస్తారు. ఇక్కడి దేమిటి? నా గుండె గభేలు మన్నది.

ఇంతలో 'నడవ్వేరా తొందరగా'' అన్నాడు రిక్షాలో కూర్చున్నాయన.

నాకు ''ఛో! ఛో! అహహై'' అన్నట్టు వినిపించింది.

''వీళ్ళకు నెమ్మదిగా చెపితే అర్థం కాదు'' అన్నాడు ఆయన స్నేహితుడు.

నాకు ''దీన్ని కోసుకు తిన'' అన్నట్టు వినిపించింది

''ఊ, నడవ్వే........''

నాకు చెరణాకోలుతో కొట్టినట్టయ్యింది. తరువాత ఏం జరిగిందో నాకు తెలియదు. నేను పల్లంలోకి దిగుతున్నట్టూ రిక్షా నన్ను వదలి నాకంటే ముందుపోతు న్నట్టూ, రిక్షాలో వాళ్ళు పెద్దపెట్టున కేకలు వేస్తున్నట్టూ మాత్రం లీలగా జ్ఞాపకం వుంది.... అంతే,

నాకు పూర్తిగా తెలివి వచ్చేటప్పటికి పోలీసుస్టేషన్లో వున్నాను. నా రిక్షా విరి గిందనీ, రిక్షాలో వున్నవారికి దెబ్బలు తగిలాయనీ, అందుకు నా అజాగ్రత్తే కారణం అనీ, చెప్పి నన్ను కొన్ని రోజులు జైల్లో ఉంచారు. నేను జైలు నుంచి బయటకు వచ్చాను. మళ్ళా రిక్షా లాగటం మొదలుపెట్టాను. కాని ఇదివర కటి ఉత్సాహం లేదు. మనస్సు నావూరు మీదే వుండేది. ఇట్లా వుండగా యివ్వాళ మా ఊరునుండి వొక మోతుబరి రైతు వచ్చాడు. రిక్షా లాగుతున్న నన్ను గుర్తు పట్టాడు. మా ఊళ్లో వర్షాలు పడ్డాయట చెరువులు నిండాయట మళ్లా మా ఊరు పచ్చబడ్డదట. ఇలా యెన్నో విషయాలు చెప్పుకుపోయాడు. నా పొలం నా కళ్ళ ముందు ఆడింది. నన్ను పిలిచింది, ఇక నాకేం తక్కువ? నా ఊరు వెళతాను.... సంతోషం పట్టలేక బజారులో నిలబడ్డ వాణ్ణి నిలబడ్డట్టు గంతేశాను.